సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 22 । మే । 2025



చీనీ టన్ను రూ.42 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.42 వేలు, కనిష్టంగా రూ.5 వేల ప్రకారం ధర పలికాయి.



హరిపురం.. అక్షరమే వరం

అమడగూరు మండలం హరిపురంలో 100 కుటుంబాలున్నాయి. గతంలో అందరూ నిరక్షరాస్యులే. కానీ పిల్లలను చదివించి కొలువుల బాట పట్టించారు.

8లో

గరిష్టం/కనిష్టం
34.6°/22.1°

వర్షప్రభావంతో జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉక్కపోత కూడా కొంత తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

లేపాక్షిలో జిల్లా స్థాయి యోగా దినోత్సవం

- కలెక్టర్ టీఎస్ చేతన్



నంది విగ్రహం వద్ద పరిశీలన చేస్తున్న కలెక్టర్

లేపాక్షి: జిల్లా స్థాయి యోగా దినోత్సవాన్ని జూన్ 21వ తేదీన లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. బుధవారం ఉదయం ఆయన లేపాక్షిలో యోగా దినోత్సవ ఏర్పాట్ల కోసం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా నంది విగ్రహం, జటాయువు, వీరభద్రస్వామి దేవాలయ ఆవరణ, ఆర్టీసీ బస్టాండు, నవోదయ విద్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం నవోదయ విద్యాలయలో యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నేటి నుంచి నెలరోజుల పాటు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గురువారం నుంచి తహసీల్దార్, ప్రిన్సిపాల్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో నవోదయ విద్యాలయలో యోగా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ చేతన్ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు.

యోగా జీవితంలో భాగం కావాలి

పుట్టపర్తి టౌన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, దాన్ని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. జిల్లాలో నెల రోజుల పాటు నిర్వహించే 'యోగా మంత్' కార్యక్రమాన్ని కలెక్టర్ చేతన్ బుధవారం స్థానిక సాయి ఆరామంలో ప్రారంభించి యోగాసనాలు వేశారు.

ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఏప్రిల్‌లో నిర్వహించిన బీఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. బీఫార్మసీ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్-19) రెగ్యులర్, సప్లిమెంటరీ, బీ ఫార్మసీ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్-15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జి. నాగప్రసాద్ నాయుడు బుధవారం విడుదల చేశారు. ఫలితాలకు జేఎన్‌టీయూ(ఏ) వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ ప్రొఫెసర్ జి.శంకర్ శేఖర్ రాజు, డాక్టర్ ఎం. అంకారావు, డాక్టర్ ఎస్.శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా?





మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, శ్రీ సత్యసాయి జిల్లా జేసీ అభిషేక్ కుమార్, జెడ్పీ సీఈఓ రామచంద్రా రెడ్డి, సమావేశంలో సమస్యలు లేవనెత్తుతున్న సభ్యులు

ఉమ్మడి జెడ్పీ సమావేశంలో సభ్యుల నిలదీత

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సొంత జిల్లాలో దయనీయ పరిస్థితులు
- అనంతపురం సర్వజనాస్పత్రిలో వైద్యులు, నర్సులు, సిబ్బంది ఇష్టారాజ్యం
- గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణం
- చిన్న సమస్యతో సవీరాకు వెళ్లినా ఆపరేషన్లు, స్టంట్లు అంటూ ప్రాణాలతో చెలగాటం
- ఇంత జరుగుతున్నా జిల్లా యంత్రాంగం ఏం చేస్తోందంటూ సభ్యుల ధ్వజం
- సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ రాజీనామా చేయాలని డిమాండ్

అనంతపురం సిటీ: 'విధి నిర్వహణలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం తారస్థాయికి చేరింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పేదల ప్రాణాలకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించలేకపోతోంది. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సొంత జిల్లాలో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రైవేటు ఆస్పత్రులు ధనదాహంతో సామాన్య, మధ్య తరగతి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి' అంటూ జెడ్పీ సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. అనంతపురంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, శ్రీసత్యసాయి జిల్లా జేసీ అభిషేక్ కుమార్, సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, అనంతపురం,మడకశిర, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు హాజరయ్యారు. ముందుగా భారత్–పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన మురళీనాయక్ సహా ఇతర సైనికుల ఆత్మ శాంతి కోసం మౌనం పాటించారు. ఆ తరువాత సభను చైర్‌పర్సన్ గిరిజమ్మ కొనసాగించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ సహా అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం, విడపనకల్లు, శెట్టూరు జెడ్పీటీసీ సభ్యులు జూటూరు చంద్రకుమార్, నీలం భాస్కర్, వాసల్లి హనమంతు, మంజునాథ, వజ్రకరూరు ఎంపీపీ రమావత్ దేవి మాట్లాడారు.

సర్వజనాస్పత్రి పాలన గాడి తప్పింది

ఉమ్మడి జిల్లాతో పాటు కడప, కర్నూలు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల వారికి అనువైన అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో డాక్టర్లు, నర్సులు, సిబ్బంది సరిగా అందుబాటులో ఉండడం లేదని సభ్యులు అన్నారు. కర్నూలు లేదా బెంగళూరుకు రెఫర్ చేస్తున్నారని మండిపడ్డారు. వైద్యులు చాలా మంది ప్రభుత్వ సొమ్మును జీతంగా తీసుకుంటూ ప్రైవేటు ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నారన్నారు. సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు అసమర్థత, నిర్లక్ష్యమే ఇందుకు కారణమని, కొన్నేళ్లుగా పాతుకుపోయి మామూళ్ల మత్తుకు అలవాటు పడి ఆస్పత్రి పరువు తీస్తున్నారని, వెంటనే ఆయన్ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖమంత్రి సొంత జిల్లాలోనే పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఇటీవల ఓ రోగిని అనంతపురం శివారులోని సవీరా ఆస్పత్రికి తీసుకెళ్లగా స్టంట్ వేయాలని, అందుకు రూ. లక్షలు ఖర్చవుతుందంటూ అక్కడి వైద్యులు తెలిపారని, అయితే రోగిని బెంగళూరుకు తరలించి టెస్ట్ చేయించగా ఎటువంటి ఆపరేషన్ అవసరం లేదని చెప్పారని సభ్యులు పేర్కొన్నారు. అవసరం లేకపోయినా ఆపరేషన్లు, స్టంట్లు వేస్తూ సవీరా యాజమాన్యం రోగులను దోచుకుంటోందని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకే వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ, ఆ తరువాత వెళ్లిపోతుండటంతో అత్యవసర కేసులకు దిక్కులేకుండా పోతోందన్నారు. విడపనకల్లు మండలంలో తొమ్మిదేళ్ల బాలిక ప్రమాదానికి గురికాగా, ప్రాణాపాయ స్థితిలో స్థానిక పీహెచ్‌సీకి తరలిస్తే.. ఒక్కరంటే ఒక్కరూ అందుబాటులో లేరని జెడ్పీటీసీ సభ్యుడు హనుమంతు ఆరోపించారు. బళ్లారికి తరలించేలోపే చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ సవీరా ఆస్పత్రిలో జరిగే వ్యవహారాలపై కలెక్టర్ దృష్టి పెట్టాలని సూచించారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. సర్వజనాస్పత్రిలో పరిస్థితి గాడిన పడుతోందని, రోజూ 2 వేల నుంచి 2,500 వరకు రోగులు వస్తున్నారని తెలిపారు. ఈ అంశంపై జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ జోక్యం చేసుకుంటూ పేదల ప్రాణాలతో చెలగాటమాడే ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ సర్వజనాస్పత్రితో పాటు పీహెచ్‌సీ, సీహెచ్‌సీలను కూడా రాత్రిళ్లు తనిఖీ చేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్, డీసీహెచ్‌ఎస్, డీఎంహెచ్‌ఓలను ఆదేశించారు. తాను ఇటీవల కొన్ని గిరిజన ప్రాంతాల్లో పర్యటించానని, దయనీయ పరిస్థితి ఉన్న మాట వాస్తవమేనని తెలిపారు.

చుక్కల చిక్కులు తీర్చండి

చుక్కల భూముల చిక్కుల గురించి నల్లమాడ జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి అధికారుల దృష్టికి తీసుకురాగా.. శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ స్పందించారు. దరఖాస్తులు ఏ స్థాయిలో ఉన్నాయో తెప్పించుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఆర్డీటీకి నిధులు ఆగిపోకుండా చూడాలి

ఆర్డీటీకి నిధులు ఆపేయడం దుర్మార్గపు చర్యగా జెడ్పీ సభ్యులు అభివర్ణించారు. ఆర్డీటీ ఉనికి ప్రశ్నార్థకం చేయడమంటే పేదల ప్రాణాలను పణంగా పెట్టడమే అవుతుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ స్పందిస్తూ.. ఆర్డీటీకి పూర్తి స్థాయిలో నిధులు వచ్చేలా, భవిష్యత్తులోనూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా జెడ్పీ సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందిస్తూ.. ఈ అంశాన్ని ఎమ్మెల్యేలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన ఎంపీల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వివరించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయమే వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఆర్డీటీకి నిధులు ఆగిపోవడంతో అక్కడి ఆస్పత్రులకు వెళ్లే గర్భిణులు, ఇతర రోగులు పూర్తిగా ప్రభుత్వ ఆస్పత్రులపై ఆధారపడ్డారని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని వైద్య శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన సేవలందించాలని కోరారు. వజ్రకరూరు ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది పని తీరుపై విచారణ జరిపి రెండు వారాల్లోగా తనకు నివేదిక ఇవ్వాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవిని ఆదేశించారు. ఆస్పత్రుల్లో గ్రూప్–4 ఉద్యోగుల నియామకానికి చర్యలు తీసుకోవాలన్నారు. నర్సులు, టెక్నీషియన్ల నియామకానికి నోటిఫికేషన్లు జారీ చేశామన్నారు. రెండు వారాల్లోపు ఈ ప్రక్రియ పూర్తి అవుతుందని చెప్పారు. ప్రభుత్వాస్పత్రుల్లో పని చేసేందుకు ఆసక్తి ఉన్న చిన్న పిల్లల స్పెషలిస్టులు, గైనకాలజిస్టులను ఇంటర్వ్యూల ద్వారా నియమిస్తామని చెప్పారు.

మెగా సప్లిమెంటరీ ఫలితాలొచ్చేశాయ్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన డిగ్రీ మెగా సప్లిమెంటరీ (ఇయర్లీ వైజ్) ఫలితాలు విడుదలయ్యాయి. వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత బుధవారం ఫలితాలను వెల్లడించారు. ఫలితాల కోసం జ్ఞానభూమి పోర్టల్‌లో చూడాలని సూచించారు. గతేడాది అక్టోబర్‌లో మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ కోర్సుల్లో 99 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే బీఎస్సీ, బీఏ, బీకాం, బీబీఏ, బీఏ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్ బాబు, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, పీఆర్వో ప్రొఫెసర్ కే.రాంగోపాల్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సి. లోకేశ్వర్లు పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ అనిత

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

పుట్టపర్తి: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరుగుతున్నాయి. మూడో రోజు 34 సెంటర్లలో జరిగిన హిందీ పరీక్షకు 1,189 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 858 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణప్ప పేర్కొన్నారు. మరో 331 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించామన్నారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు.

21 మండలాల్లో వర్షం

ప్రశాంతి నిలయం: ముందస్తు 'నైరుతి' ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ 21 మండలాల పరిధిలో 306.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా గోరంట్ల మండలంలో 48.2 మి.మీ వర్షపాతం నమోదుకాగా, అత్యల్పంగా రొద్దం మండలంలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. ఇక నల్లచెరువు మండలంలో 45.2 మి.మీ, ఓబులదేవర చెరువు 44.2, కనగానపల్లి, ఎన్పీకుంట 24.2, సోమందేపల్లి 21.4, అమడగూరు 16.4, పెనుకొండ 14.0, కొత్తచెరువు 12.8, పుట్టపర్తి 10.6, గాండ్లపెంట 9.6, బత్తలపల్లి 8.2, తలుపుల 4.2, కదిరి 4.0, తనకల్లు 3.6, ధర్మవరం, బుక్కపట్నం మండలాల్లో 3.4 మి.మీ, రామగిరి 3.2, చిలమత్తూరు 2.8, చెన్నేకొత్తపల్లి మండలంలో 1.6 మి.మీ చొప్పున వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు.



హంద్రీ-నీవా, ఆర్డీటీ సమస్యలపై పోరాడతాం





మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి, చిత్రంలో పార్టీ రెండు జిల్లాల అధ్యక్షులు ఉషశ్రీచరణ్, అనంత, నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు, నేతలు

- రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోంది
- ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాడతాం
- ఎంపీ, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'రాయలసీమ జిల్లాలకు కల్పతరువు లాంటి హంద్రీ-నీవా సామర్థ్యాన్ని తగ్గించి.. కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోంది. అదేవిధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్షలాది మందికి అండగా ఉంటున్న ఆర్డీటీని కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ప్రజలకు అన్యాయం జరిగే ఏ నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకున్నా.. దానిపై వైఎస్సార్‌సీపీ పోరాడుతుంది' అని ఎంపీ, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం అనంతపురంలోని ఓ హోటల్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలతో సమావేశం జరిగింది. జిల్లాలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. హంద్రీ-నీవా, ఆర్డీటీ సమస్యలను జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఉషశ్రీ చరణ్, సమన్వయకర్తలు రీజినల్ కో–ఆర్డినేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ప్రధాన సమస్యలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా డైవర్షన్ పాలిటిక్స్ మినహా ప్రజలకు చేసిందేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హంద్రీ-నీవా కాలువ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటే.. ఇప్పుడు సీఎం చంద్రబాబు హంద్రీ-నీవా సామర్థ్యాన్ని తగ్గించి, లైనింగ్ పనులను మొదలు పెట్టారన్నారు. దీని ద్వారా భవిష్యత్తులో హంద్రీ-నీవా సామర్థ్యాన్ని పెంచేందుకు వీల్లేకుండా పోతుందన్నారు. రాయలసీమ ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తప్పుదోవ పట్టించేందుకు ఇప్పటి వరకు 20 రకాల అంశాలను తెరపైకి తెచ్చి డైవర్షన్ పాలిటిక్స్‌కు సీఎం చంద్రబాబు తెర లేపారన్నారు. అందులో ఏ ఒక్క దాన్నీ నిరూపించలేక పోయారన్నారు.

డైవర్షన్ కోసమే..

ఎన్నికల హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కూటమి ప్రభుత్వం మద్యం స్కాంను తెరపైకి తెచ్చిందని మిథున్‌రెడ్డి మండిపడ్డారు. దీనికి సంబంధించి రూపాయి కూడా సీజ్ చేయలేదన్నారు. రేషన్ షాపులను రద్దు చేస్తామంటూ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబడుతున్నామన్నారు. సమావేశంలో అనంతపురం, హిందూపురం పార్లమెంట్ పార్టీ పరిశీలకులు నరేష్ కుమార్ రెడ్డి, రమేష్ కుమార్ రెడ్డి, సమన్వయకర్తలు సాకే శైలజానాథ్, వై.వెంకటరామిరెడ్డి, తలారి రంగయ్య, విశ్వేశ్వర రెడ్డి, మెట్టు గోవింద రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, ఈరలక్కప్ప, దీపిక, మక్బూల్ అహ్మద్, మాజీ మంత్రి శంకర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధమవుదాం

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుదామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం అనంతపురంలోని ఓ హోటల్‌లో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎంపీ మిథున్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉష శ్రీచరణ్ మాట్లాడుతూ మునిసిపాలిటీ, సర్పంచ్ ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే గడువుందని, ఆ లోపు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దామన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుద్దామన్నారు. ఆర్డీటీకి అండగా ఉందామన్నారు. ప్రజానీకానికి ఆర్డీటీ అందిస్తున్న సేవలను ప్రభుత్వం విస్మరించిందని, ఇప్పుడు ఆ సంస్థ సమస్యను పట్టించుకోవడం లేదన్నారు. హంద్రీ-నీవా సామర్థ్యాన్ని పెంచాలన్నారు. సీఎం చంద్రబాబు అమరావతి జపం చేస్తూ.. రాయలసీమకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. వీటిపై అందరూ కలసికట్టుగా పోరాడుదామన్నారు. అనంతరం సమన్వయకర్తలు మాట్లాడారు.

భూసేకరణపై రైతుల నిరసనాగ్రహం



తహసీల్దార్ ఆఫీసు ఎదుట బైఠాయించిన మలుగూరు, చలివెందుల, రాచేపల్లి, మీనకుంటపల్లి రైతులు, రైతు సంఘం నాయకులు



భూముల సర్వే ఆపాలంటూ డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్‌ను చుట్టుముట్టిన వివిధ గ్రామాల రైతులు

- హిందూపురం తహసీల్దార్ కార్యాలయం ముట్టడి
- మూడు గ్రామాల నుంచి వందలాదిగా తరలి వచ్చిన రైతులు
- తమకు తెలియకుండానే భూముల్లో సర్వే ఎలా చేస్తారంటూ ఆగ్రహం
- వ్యవసాయం నుంచి తమను దూరం చేయకండని వేడుకోలు

హిందూపురం: పరిశ్రమల ఏర్పాటు పేరుతో ప్రభుత్వం ఏడాదిలో మూడు పంటలు పండే పొలాలను సేకరించేందుకు సిద్ధం కాగా రైతులు భారీ ఎత్తున నిరసనకు దిగారు. పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం హిందూపురం మండలం మలుగూరు, చలివెందుల, రాచేపల్లి, మీనకుంటపల్లి, కొండూరు గ్రామాల్లో భూములు సేకరించేందుకు సిద్ధమైంది. ఈక్రమంలోనే ఇటీవల కొందరు అధికారులు రైతులకు సమాచారం కూడా ఇవ్వకుండా సర్వేకు సిద్ధమయ్యారు. తమ జీవనాధారమైన భూములు తీసుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను నిరసిస్తూ ఆయా గ్రామాల నుంచి వందలాది మంది రైతులు బుధవారం హిందూపురం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం ఎదురుగా బైఠాయించి లోనికి ఎవరూ వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, రైతు సంఘం నాయకులు మాట్లాడారు. చంద్రబాబూ.. వ్యవసాయం నుంచి మమ్మల్ని దూరం చేయకు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అన్నం పెట్టే రైతే... దేశానికి వెన్నెముక అంటారని, అలాంటి రైతుల పొలాలను లాక్కోవడానికి కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఏడాదికి మూడు పంటలు పండే పొలాలను లాక్కుంటే వ్యవసాయమే జీవనాధారంగా బతికే వందలాది కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే దుస్థితి తలెత్తుతుందన్నారు. వ్యవసాయమే జీవనాధారమైన తమకు ఈ భూములు లేకపోతే రోడ్డున పడతామన్నారు.

సమాచారం ఇవ్వకుండా సర్వే ఎందుకు

మలుగూరు రెవెన్యూ పొలాల్లో రైతులకు తెలియకుండానే భూ సర్వే చేయించడమేమిటి రైతులు, రైతు సంఘం నాయకులు ప్రశ్నించారు. రైతులు గంటల తరబడి కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసనకు దిగినా ఎవరూ పట్టించుకోకపోవడంతో రైతులే కార్యాలయంలోనికి వెళ్లారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్ కల్పించుకుని తనకు పూర్తి విషయం తెలియదని, అయితే అనుమతి లేకుండా ఎవరి భూములూ సేకరించబోమని తెలిపారు. భూసేకరణ ఏదైనా ఉంటే తప్పక తెలిజేస్తామంటూ రైతులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం తహసీల్దార్ చిలమత్తూరు ఆఫీసుకు వెళ్లారని, ఆయన వచ్చి పూర్తి వివరాలు తెలియజేస్తారని సమాధానం చెప్పారు. అయితే రైతులు దీనిపై మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామంలో సర్వే నిర్వహించేందుకు తహసీల్దార్ రాగా, తామే కార్యాలయానికి వస్తామని, అప్పుడే సమాచారం ఇవ్వాలని కోరామన్నారు. ఇప్పుడు ఆయనే కార్యాలయంలో లేకుండా వెళ్లిపోవడం చూస్తే ఏదో జరుగుతోందన్న అనుమానం కలుగుతోందన్నారు. ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేదని లేదన్నారు. తహసీల్దార్ ఏమైనా చెప్పాలనుకుంటే ఆయనే, తమ గ్రామానికి రావాలని చెప్పారు. అనంతరం తమ భూములు సేకరించవద్దని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించి వెనుదిరిగారు. రైతుల నిరసనకు రైతు సంఘ నాయకులు, వివిధ పార్టీ నాయకులు మద్దతు పలికారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకటరామిరెడ్డి, సిద్దారెడ్డి, ఓడీడీఆర్ శ్రీనివాసులు, చైతన్య గంగిరెడ్డి, సోమకుమార్, రవీంద్రరెడ్డి, పెద్దన్న, వెంకటరెడ్డి, అంజన్‌రెడ్డి, బీఎస్పీ శ్రీరాములు పాల్గొన్నారు.

భూ సేకరణను అడ్డుకున్న రైతులు

లేపాక్షి: మండలంలోని కొండూరు గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన భూ సేకరణను రైతులు బుధవారం అడ్డుకున్నారు. భూ సర్వే చేయడానికి వచ్చిన అధికారులను వెనక్కు పంపారు. అనంతరం తమ జీవనాధారమైన భూములను సేకరించవద్దని తహసీల్దార్ సౌజన్యలక్ష్మికి వినతి పత్రం అందజేశారు.



సర్వే అధికారులతో మాట్లాడుతున్న కొండూరు రైతులు

క్లుప్తంగా

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



ప్రమాదానికి గురైన కారు

తాడిమర్రి: నిడిగల్లు గ్రామ సమీపంలో ఓ కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. పోలీసుల కథనం మేరకు... ధర్మవరానికి చెందిన షబ్బీర్ బుధవారం ఉదయం కారులో ఎరువులు వేసుకుని దాడితోటలో ఓ రైతుకు అందించి తిరిగి ధర్మవరం వెళుతున్నాడు. నిడిగల్లు సమీపంలోని చింతతోపు వద్దకు రాగానే కారు అదుపుతప్పి సోలార్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదం జరగ్గానే బెలూన్లు తెరుచుకోవడంతో డ్రైవర్‌కు ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఉగ్రవాదాన్ని అంతమొందించాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్ఎం గుప్తా

గుంతకల్లు: ఉగ్రవాదాన్ని అంతమొందించేందకు ప్రభుత్వం కృషి చేయాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా కోరారు. బుధవారం గుంతకల్లులోని డీఆర్ఎం కార్యాలయంలో యాంటీ టెర్రరిజంపై ఉద్యోగులతో డీఆర్ఎం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత పిచ్చితో ఉగ్రవాదులు చేసే దుశ్చర్యలకు అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, ఆర్‌పీఎఫ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారయత్నం


హిందూపురం: ఆరుబయట ఆడుకుంటున్న బాలికపై ఓ వ్యక్తి అత్యాచారయత్నం చేశాడు. బాలిక కేకలు విన్న స్థానికులు గమనించి అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. వివరాలిలా ఉన్నాయి. హిందూపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఓ బాలిక ఆడుకుంటోంది. పక్కనే ఉన్న ఓ వ్యక్తి తినుబండారాల ఆశ చూపి పక్కకు తీసుకెళ్లి అత్యాచారానికి ప్రయత్నించాడు. బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు, బంధువులు గమనించి పరుగున వచ్చారు. వారిని చూసి ఆ వ్యక్తి బయటకు పరుగులు తీసినా.. వెంటాడి పట్టుకున్నారు. దేహశుద్ధి చేసిన అనంతరం రూరల్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వారంతా నిరక్షరాస్యులు. అయితేనేం తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. వారు ప్రయోజకులై ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో కొలువులు సంపాదించి ఉన్నత స్థితికి చేరుకున్నారు. అక్షరమే హరిపురం గ్రామానికి వరంగా మారింది.



హరిపురం గ్రామ ముఖ చిత్రం

హరిపురం.. అక్షరమే వరం



- వంద కుటుంబాల్లో 90 మంది గొర్రెల కాపరులే
- నిరక్షరాస్యులైనా.. పిల్లలను చదివించుకున్నారు
- 50 మంది ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో కొలువులు



గొర్రెలు మేపుతున్న హరిపురం కాపరులు

అమడగూరు: అదో కుగ్రామం. అక్కడ నివసిస్తున్న వారంతా వాల్మీకి సామాజికవర్గానికి చెందిన వారే. గతంలో ఒకే కుటుంబంలా ఉన్నవారు.. నేడు వంద కుటుంబాల వరకు విస్తరించారు. ఇందులో 90 ఇళ్లకు చెందినవారు గొర్రెలు మేపుకొంటూ జీవనం సాగిస్తుంటారు. అమడగూరు మండలంలో పుట్టగోనులపల్లిగా పిలిచే ఊరు కాల క్రమేణా హరిపురంగా రూపాంతరం చెందింది. అన్ని కుటుంబాల్లోనూ తల్లిదండ్రులు నిరక్షరాస్యులైనా తమ పిల్లలను కష్టపడి చదివించారు. ఇప్పుడు ఆ గ్రామంలో 15 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు. మరో 35 మంది ప్రైవేట్ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా, మేనేజర్లుగా, సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్నారు. వీరిని ఆదర్శంగా తీసుకునే గ్రామంలో ఉన్న యువతీ యువకులంతా ఉద్యోగాల కోసం ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

ఇంటికో ఉద్యోగమే లక్ష్యం

గ్రామంలో 40 మంది యువకులతో పాటు 33 మంది యువతులు ఉండగా.. వారంతా డిగ్రీలు, పీజీలు పూర్తి చేశారంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. విద్యావంతులుగా ఉన్న వారంతా తమ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలనే తపనతో అందరూ నూతన గృహాలను నిర్మించుకోవడంతో పాటు చందాల ద్వారా రూ.75 లక్షల వ్యయంతో ఆలయాన్ని నిర్మించారు. జేకే పల్లి పంచాయతీలో మారుమూల గ్రామంగా ఉన్న హరిపురానికి గ్రామస్తులంతా కలసికట్టుగా ఉంటూ కందుకూరిపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న పొగాకుతోపు నుంచి తనకంటిపల్లి మీదుగా తారు రోడ్డు వేయించుకున్నారు. ఏదేమైనా భవిష్యత్తులో గ్రామంలోని ఇంటికో ఉద్యోగం ఉందన్నా ఆశ్చర్యపోనక్కర్లేదని పలువురు చర్చించు కొంటున్నారు.

మా ఇంట్లో ముగ్గురు ఉద్యోగులు



మాకు ఎలాంటి ఆస్తిపాస్తులూ లేవు. నాన్న సేవా భారతి ట్రస్టులో సభ్యునిగా సేవ చేస్తున్నారు. అమ్మ అంగన్‌వాడీ కార్యకర్త. నేను ఓడిచెరువు మండలం డబురువాండ్లపల్లి సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా, నా తమ్ముడు అరవింద్ ఎంబీఏ పూర్తి చేసి మార్కెటింగ్ మేనేజర్‌గా పని చేస్తున్నాం. మా ఎదుగుదలలో తల్లితండ్రుల ప్రోత్సాహం మరువలేనిది.

– పవన్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే



తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే నేను, నా చెల్లెలు బాగా చదువుకున్నాం. నేను బీటెక్ పూర్తి చేసి బెంగళూరులో ఇంజినీర్‌గా పని చేస్తున్నా. నా చెల్లెలు బీ టెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది, మా నాన్న కదిరి మున్సిపల్ స్కూల్లో పీఈటీగా పని చేస్తున్నారు. మా గ్రామంలో ప్రతి ఇంట్లోనూ ఉద్యోగుస్తులున్నారని మేము పట్టుదలతో చదివాము.

– హంసి వందన, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

ప్రత్యేకత కోసం జేఎల్ఎంగా...



మా ఊళ్లో అందరి ఇళ్లలోనూ ఉద్యోగస్తులు ఉన్నారు. అయితే అందరూ ఉపాధ్యాయ, సాఫ్ట్‌వేర్ దారులు వెతుక్కుంటుండగా ప్రత్యేకంగా ఉండాలని ఎలక్ట్రికల్ కోర్సుల కోసం నేను ఐటీఐ చదివాను. ప్రస్తుతం జూనియర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్నాను. మా అమ్మ సర్పంచ్‌గా ఉన్నారు. తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటున్నారు. – అంబరీష్, జేఎల్ఎం

మా కష్టం పిల్లలకు రాకూడదని...



మా తాతల కాలం నుంచి మేము గొర్రెలు మేపుతున్నాం. అయితే మారుతున్న కాలానుగుణంగా మా బిడ్డలు ఇలా కష్టాలు పడొద్దని నా ఇద్దరి కొడుకుల్ని బాగా చదివించాను. పెద్దకొడుకు రాజశేఖర్ బీ ఫార్మసీ పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కొడుకు ఎంసీఏ పూర్తి చేసి లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నాడు.

– కిష్టప్ప, గొర్రెల కాపరి, హరిపురం

మహిళను బలిగొన్న కరెంట్ షాక్



పుష్పావతి(ఫైల్)

మడకశిరరూరల్: దిగువ అచ్చంపల్లికి చెందిన మహిళ పుష్పావతి (36) బుధవారం సాయంత్రం విద్యుదాఘాతంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇంటి ఆవరణలో సింగిల్ ఫేజ్ మోటార్ ఆన్ చేసి సంపు వద్ద నీటిని పట్టుకోవడానికి వెళ్లే సమయంలో పుష్పావతి కరెంట్ షాక్‌కు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు మడకశిర ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈమెకు భర్త, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రభుత్వం మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్షితకు 'షైనింగ్ స్టార్' అవార్డు



విద్యాశాఖ మంత్రి ద్వారా అవార్డు అందుకున్న అక్షిత

అమరాపురం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో హాలుకూరు సమీపంలోని కేజీబీవీ విద్యార్థిని అక్షిత 600కు 586 మార్కులతో రాష్ట్రంలోనే కేజీబీవీల్లో రెండో స్థానంలో నిలిచి 'షైనింగ్ స్టార్' అవార్డుకు ఎంపికైంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కార్యాలయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా విద్యార్థినికి అవార్డును అందజేసినట్లు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. మారుమూలన, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో చదువుకున్న విద్యార్థినికి అత్యుత్తమ మార్కులు సాధించడం పట్ల మంత్రి ప్రశంసల జల్లు కురిపించారని పేర్కొన్నారు. ఈమె తల్లిదండ్రులు చిత్తయ్య, ఎర్రక్కలు కుందుర్పి మండలం నిజవల్లి గ్రామానికి చెందిన వారన్నారు. అవార్డు అందుకున్న సందర్భంగా కేజీబీవీ టీచర్లు, సిబ్బంది అక్షితను అభినందించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

హిందూపురం: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్త సయ్యద్ అతావుల్లాపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మూడేళ్ల క్రితం హస్నాబాద్‌లో నివాసముంటున్న సానియాతో అతావుల్లాకు వివాహమైంది. వివాహ సమయంలో ఆమె తల్లిదండ్రులు వరకట్నం తదితర కానుకలను అందజేశారు. అయినా ఇంకా అదనపు కట్నం కావాలని అతావుల్లా వేధిస్తుండటంతో భరించలేకపోయిన భార్య వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి, అతావుల్లాను అరెస్టు చేశారు.

దివ్యాంగులకు బదిలీల్లో ప్రాధాన్యత కల్పించండి

హిందూపురం: సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో దివ్యాంగులకు ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు అశ్వర్థ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బ్లైండ్ కేటగిరీ వారి మాదిరే మిగతా దివ్యాంగ ఉద్యోగులకు కూడా బదిలీల్లో మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థించారు. దివ్యాంగ ఉద్యోగులు కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేస్తూ.. బదిలీలకు ఆసక్తి కనబరచని దివ్యాంగులను యథాస్థితిలో ఉంచాలని కోరారు. అలాగే దివ్యాంగ ఉద్యోగులను హేతుబద్ధీకరణ ప్రక్రియలో మిగులు ఉద్యోగులుగా చూపించి వారి మాతృశాఖలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సీనియార్టీ ప్రాతిపదికన ప్రమోషన్లు కల్పించి సీనియర్ అసిస్టెంట్లకు పే స్కేల్ వర్తింపచేయాలన్నారు. హేతుబద్ధీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బదిలీల్లో రాజకీయ ప్రమేయం లేకుండా పారదర్శకంగా చేపట్టాలని కోరారు.

ఉమ్మడి జిల్లాలో చెరువులను పూర్వస్థితికి తేవాలి

- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో 507 చెరువులను పూర్వస్థితికి తేవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. చెరువుల పునరుద్ధరణకు కేంద్రం 60, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు వెచ్చిస్తాయని పేర్కొన్నారు. కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో జిల్లాస్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ (డీఎల్ఐ అండ్ ఎంసీ) సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, ప్రభుత్వ నిధులతో శ్రీ సత్యసాయి జిల్లాలో 411 చెరువులు, అనంతపురం జిల్లాలో 96 చెరువులను పూర్వస్థితికి తీసుకురావడానికి చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. చెరువులను గుర్తించి పనులకు సంబంధించి ప్రతిపాదనలను రాష్ట్ర కమిటీకి పంపించాలన్నారు. ఇప్పటికే 29 చెరువులను గుర్తించారని, మిగిలిన చెరువులను పటిష్టపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పండమేరు పైభాగాన, మరువ వంక, నడిమి వంక పైభాగన ఉన్న చెరువులను కూడా బలోపేతం చేయాలని సూచించారు.

సమావేశంలో మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథ రెడ్డి, డ్వామా పీడీ సలీంబాషా, భూగర్భ జల శాఖ డీడీ తిప్పేస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, కేంద్ర భూగర్భజల బోర్డు అధికారి స్వరూప్ కళ్యాణ్, కేంద్రీయ జలసంఘం ఏడీ సీహెచ్ సంజీవ్, మైనర్ ఇరిగేషన్ ఈఈ రాము, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలా.. వీధిరౌడీలా?



మాట్లాడుతున్న పెన్నోబులేసు

అనంతపురం కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ జిల్లాపరిషత్ కార్యాలయంలో వీధి రౌడీల్లా ప్రవర్తించారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు విమర్శించారు. బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జెడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటోను తొలగించాలంటూ అధికారులపై హుకుం జారీ చేయడమేంటని ప్రశ్నించారు. ఇంతకన్నా దౌర్భాగ్యం ఎక్కడా లేదని పేర్కొన్నారు. అధికారులను బెదిరిస్తూ దురుసుగా ప్రవర్తించారని మండిపడ్డారు. రాష్ట్రంలో మంత్రి నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందనడానికి ఇదొక నిలువెత్తు సాక్ష్యమని అభివర్ణించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.

బెంగళూరు-బీదర్ మధ్య ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బెంగళూరు-బీదర్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22, 24, 26వ తేదీల్లో బెంగళూరు జంక్షన్ (06589) రాత్రి 9.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.15 గంటలకు బీదర్ జంక్షన్ చేరుతుందన్నారు. అదేవిధంగా ఈ నెల 23, 25, 27వ తేదీల్లో బీదర్ జంక్షన్ (06590) మధ్యాహ్నం 12.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 3 గంటలకు బెంగళూరు జంక్షన్‌కు చేరుతుందన్నారు. యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం, రాయచూర్, కృష్ణ, యాదగిరి, షాహబాద్, కలబురిగి, హోమ్నాబాద్ మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు. 3-ఏసీ, స్లీపర్, జనరల్ బోగీలు ఉంటాయని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రాణం తీసిన అతివేగం



మృతి చెందిన డ్రైవర్ జబ్బార్



స్వల్పంగా గాయపడిన పెళ్లికుమారుడు రాజేష్

గుత్తి రూరల్: అతివేగం ఒకరి ప్రాణాన్ని బలిగొంది. ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో పెళ్లిబృందం కారును ఎదురుగా వచ్చిన లారీ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పెళ్లికుమారుడితో సహా ఆరుగురుగాయపడ్డారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడిపత్రిలోని గాజులపాలెంకు చెందిన రాజేష్ వివాహం వజ్రకరూరులో గురువారం జరగనుంది. బుధవారం పెళ్లి కుమారుడు రాజేష్ బంధువులతో కలిసి ఇన్నోవా కారులో బయల్దేరారు. గుత్తి మండలం జక్కలచెరువు శివారు మలుపులో ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయిన ఇన్నోవా కారును రాజస్థాన్ నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వేగంగా వచ్చి ఢీకొట్టి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తాడిపత్రికి చెందిన కారు డ్రైవర్ జబ్బార్ (45) అక్కడికక్కడే మృతి చెందాడు. పెళ్లి కుమారుడు రాజేష్‌తో పాటు బంధువులు ఉమాదేవి, సరోజ, ఎన్.శ్రీనివాసులు, నారాయణమ్మ, శ్రీనివాసులు గాయపడ్డారు. వీరిని గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఉమాదేవి, నారాయణమ్మల పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు అనంతపురం ఆస్పత్రికి పంపించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ సురేష్ పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో అటెండర్ దుర్మరణం



మహబూబ్‌బాషా (ఫైల్)

గుంతకల్లు: రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ కార్యాలయ అటెండర్ షేక్ మహబూబ్‌బాషా (25) దుర్మరణం చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోమినాబాద్‌కు చెందిన ఖాజా, మున్నీ దంపతుల కుమారుడు మహబూబ్‌బాషా ఆర్డీఓ కార్యాలయంలో అటెండర్ పని చేస్తున్నారు. ఇటీవలే డిప్యుటేషన్‌పై వజ్రకరూరు తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా బదిలీ అయ్యారు. రోజూ డ్యూటీకి ద్విచక్రవాహనంపై వెళ్లి వచ్చేవారు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకొని ద్విచక్రవాహనంలో గుంతకల్లుకు బయల్దేరిన మహబుబ్‌బాషా మార్గమధ్యం కమలపాడు వద్ద వేగంగా వస్తున్న జీటీ ఆటో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఆటో బోల్తా పడుటంతో గుంతకల్లులోని హౌసింగ్ బోర్డుకు చెందిన అబ్దుల్ రజాక్, అతని కూమరుడు రోషన్ గాయపడ్డారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్ ఆస్పత్రికి వెళ్లి అటెండర్ మృతదేహానికి నివాళులర్పించారు. ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రమాదేవి మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఫొటోల కోసం పాకులాడటమేంటి?



వెన్నపూస రవీంద్రరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: అభివృద్ధి మరచి ఫొటోల కోసం పాకులాడటం ఏంటని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రరెడ్డి పేర్కొన్నారు. జెడ్పీలో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చాంబర్‌లో ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్ర బాబు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చర్యలను ఆయన ఖండిస్తూ బుధవారం తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. సభ్య సమాజం తలదించుకునేలా టీడీపీ ఎమ్మెల్యేలు వ్యవహరించారన్నారు. జిల్లాలో హంద్రీ-నీవా, ఆర్డీటీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అటువంటివాటిపై పాలకులు నోరు మెదపకుండా దిగజారుడు రాజకీయాలకు పాల్పడడం ఏంటని నిలదీశారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలను భయభ్రాంతులకు గురి చేసేలా వ్యవహరించారన్నారు. ఉపాధి హామీ పనుల అవినీతిపై చర్చ జరిపిన పాపాన పోలేదన్నారు. ఓ బీసీ మహిళా ప్రజాప్రతినిధి చాంబర్‌లోకి వెళ్లి హంగామా చేయడమే కాకుండా జెడ్పీ సీఈఓపై దబాయించడమేంటన్నారు.

హెచ్చెల్సీ ఎస్ఈగా పురార్ధనరెడ్డి

అనంతపురము సెంట్రల్: హెచ్చెల్సీ ఎస్ఈగా పురార్ధన రెడ్డి నియమితులయ్యారు. నంద్యాల జిల్లా ఎస్ఆర్‌బీసీ ప్రాజెక్ట్ సర్కిల్ -1 ఎస్ఈగా పని చేస్తున్న ఈయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా గత నెలాఖరులో హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ ఉద్యోగ విరమణ పొందారు. అయినప్పటికీ ఎస్ఈ నియామకం జరగక పోవడంతో ఈ నెల 13న 'ప్రగతి తప్పిన హెచ్చెల్సీ' శీర్షికన సాక్షిలో కథనం వెలువడటంతో ఉన్నతాధికారులు స్పందించి ఇన్‌చార్జ్ (ఎఫ్ఏసీ) ఎస్ఈగా పురార్ధనరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు.

అద్దె బస్సులపై ఆరా

- ఆర్టీసీ అధికారులు కళ్లు మూసుకున్నారా!
- ఏటా ఎంత నష్టమొచ్చిందో లెక్కలు తేల్చండి
- అద్దెబస్సుల టోల్ రాయితీ లెక్కగట్టే పనిలో విజిలెన్స్
- 2,788 అద్దెబస్సుల జాబితాను పరిశీలిస్తున్న అధికారులు
- నెలవారీ సమీక్షలో ఆరా తీసిన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు

సాక్షి ఎఫెక్ట్..



రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ అద్దె బస్సుల వివరాలు	
జోన్1- విజయనగరం	436
జోన్2-విజయవాడ	663
జోన్3- నెల్లూరు	556
జోన్4-కడప	1133
మొత్తం	2,788

అనంతపురం క్రైం: ఆర్టీసీలో అద్దె బస్సుల టోల్ చెల్లింపు రాయితీలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ వ్యవహారంపై ఆర్టీసీ ప్రధాన కార్యాలయం ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. బుధవారం విజయవాడ బస్ భవన్‌లో నిర్వహించిన నెలవారీ సమీక్షలో అనంతపురం రీజియన్‌లో అద్దె బస్సుల టోల్ రాయితీ వ్యవహారం హాట్ టాపిక్‌గా నిలిచింది. సమీక్షకు హాజరైన అనంతపురం రీజియన్ సిబ్బంది, అధికారులు, యూనియన్ నేతల ద్వారా అంత్యంత విశ్వసనీయ సమాచారం ఇలా ఉంది... మంగళవారం 'ఆర్టీసీలో అధికారులే టో(తో)లు తీశారు..'అంటూ సాక్షిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. రాష్ట్ర వ్యాప్తంగా అద్దె బస్సుల జాబితాను పరిశీలించాలని సూచించారు. డిపోల వారిగా అద్దె బస్సులు, వాటి రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలించాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్ టెండరు నిర్వహణలో ప్రతి అంశాన్నీ పరిశీలించాల్సిన ఈడీ, ఆర్ఎం క్యాడర్ అధికారుల తప్పిదం ఇందులో స్పష్టంగా కనిపిస్తోందని వివరించారు. అనంతపురం ఆర్టీసీ రీజియన్‌లో ఆరు నెలల క్రితమే ఈ విషయం బయటకు పొక్కినా సదరు అధికారులు ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదని ఆరా తీసినట్లు తెలిసింది. కార్పొరేషన్‌కు రోజువారీ వస్తున్న నష్టాన్ని పూడ్చాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం ఏంటని ప్రశ్నించినట్లు సమాచారం. ఒక్క అనంతపురం రీజియన్‌లోనే సుమారు రూ.5 కోట్లు నష్టపోయినట్లు తేలితే రాష్ట్ర వ్యాప్తంగా ఆ నష్టం ఏమేరకు ఉంటుందో తక్షణం ఆరా తీయాలని సూచించినట్లు తెలిసింది.

అద్దె బస్సుల యజమానులకు నోటీసుల జారీ

రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు జోన్‌ల పరిధిలో 2,788 అద్దె బస్సులు నడుస్తున్నాయి. ఈ బస్సులు రోజువారీ ఎన్ని సింగిల్స్ తిరుగుతున్నాయి. ఎన్ని టోల్ గేట్లను దాటుకుని పోతున్నాయన్న దానిపై వివరాలు సేకరించాలని అకౌంట్స్ విభాగాలకు ప్రధాన కార్యాలయం నుంచి ఆదేశాలందినట్లు సమాచారం. తక్షణం అద్దె బస్సులు స్థానిక జిల్లా పరిధిలో రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా ఉంటే సదరు బస్సు యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ఏదేమైనా ఇంత పెద్ద నష్టానికి కారకులైన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారా? లేక సర్దుకుంటారా? అన్నది తేలాల్సి ఉంది.

టోల్ రాయితీ నష్టంపై విజిలెన్స్'

అనంతపురం ఆర్టీసీ రీజియన్ పరిధిలో అద్దె బస్సుల టోల్ రాయితీ పొందలేక పోవడానికి ప్రధాన కారణం లోకల్ రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడమే కారణమని ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ మేరకు డిపోల వారీగా అద్దె బస్సుల వివరాలను సేకరించింది. ఈ మేరకు నివేదికను ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి పంపింది. కాగా ఎంత మేరకు నష్టం జరిగిందన్న వివరాలను ఇంకా సేకరిస్తున్నామని ఆర్టీసీ విజిలెన్స్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.